


# కరపత్రం

SINCE 2014

గురువారం జూన్ 04, 2026 | సంపుటి : 2 | సంచిక : 233 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

### నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్

**న్యూఢిల్లీ,జూన్3 :**
నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ నెల 10న ఇండియాకు అత్యధిక కాలం పని చేసిన ప్రధానిగా నిలవబోతున్నారు. అది కూడా ఎన్నికల్లో గెలిచి, అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూను దాటేయబోతున్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ మే 13, 1952న పదవీ బాధ్యతలు చేపట్టారు. మే 27, 1964న ఆయన మరణించేవరకు ప్రధానిగానే ఉన్నారు.



2లో..

పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ

## వర్షాలు కురిసే అవకాశం

- తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక
- ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు



మిగతాది 2లో

## నైజీరియా యువతకు శిక్షణ

### రాష్ట్ర విత్తన రంగం ఉపకరిస్తుందన్న తుమ్మల



**హైదరాబాద్,జూన్3 :**
తెలంగాణ రాష్ట్ర విత్తన రంగ విశిష్ట అనుభవం, సాధించిన ప్రగతి నైజీరియా దేశపు యువతకు ఎంతగానో ఉపయోగపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ వేదికగా జరిగిన అంతర్జాతీయ విత్తన శిక్షణ ముగింపు కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



## తెలంగాణ, తూరంగియా

# మధ్య కీలక ఒప్పందం

- టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం
- యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్

**హైదరాబాద్,జూన్3 :**
తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

మిగతాద్ది 2 లో



2 లో

## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026‘లో పాల్గొనండి
- దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో సిఎం రేవంత్ భేటీ

**హైదరాబాద్,జూన్3 :**
భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు.

# వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా

- కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను
- తెలంగాణ అప్పులపై చర్చకు సిద్ధమే
- మీట్ ద ప్రెస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,జూన్ 3 :**
వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు.



మిగతాది 2లో



## ఆ కమ్యూనిజం ఎక్కడికి పోయింది పవన్?

### - కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్:**
తెలుగు రాష్ట్రాల్లో పవన్ కల్యాణ్ అపరిచితుడిగా వ్యవహరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎద్దేవా చేశారు. మంగళవారం నిర్వహించిన పవన్ మీడియా సమావేశంపై ఆయన స్పందించారు. పవన్ అమాయకంగా మాట్లాడుతున్నారనే బాధ కలుగుతుందని చెప్పారు.“నేను, మా నాన్న కమ్యూనిస్టులమని పదేపదే చెప్పావు.. మరి ఆ కమ్యూనిజం ఎక్కడికి పోయింది పవన్?సనాతన ధర్మాన్ని ఎవరు అవమానించారు? ప్రపంచ కార్మికులారా విడిపోండి అని మేము పిలుపునిచ్చామా? మమ్మల్ని ఎందుకు లాగారు?కమ్యూనిజం చచ్చిపోయిందని ఎవరు చెప్పారు? జనసేన కనుమరుగు అవుతుందేమో గానీ, కమ్యూనిజం చచ్చిపోదు. ఏపీ, తెలంగాణ రాద్ధాంతం మీ రాజకీయ ప్రయోజనాల కోసమా? వేరేవారి కోసమా?చెప్పాలి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే వచ్చి సవాల్ విసరడం అంటే ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టడమే”అని కూనంనేని అన్నారు.

# తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

- జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు
- మార్కెట్ రేట్ల మేరకు సవరణలు చేశామన్న పొంగులేటి

**హైదరాబాద్,జూన్3 :**
తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి.



మిగతాది 2లో




2లో..

### అత్యాధునిక వైద్య పరిశోధనల

## కేంద్రంగా హైదరాబాద్

**హైదరాబాద్**
క్యాన్సర్, ఇతర అరుదైన రోగాలను నయం చేసే బయోలాజిక్స్, వ్యాక్సిన్లు, సెల్ అండ్ జీన్ థెరపీ వంటి అత్యంత అధునాతన వైద్య పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.పరిశోధన దశ నుంచి కమర్షియల్ ప్రొడక్షన్ దాకా అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రపంచ స్థాయి ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేసేలా సమగ్ర కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నామన్నారు.



2లో..

### విద్యుత్ డిస్కమ్‌ను

# మూడు ముక్కలు

- ఆదాయ డిస్కమ్‌లను ప్రవేట్‌కు అప్పగించే కుట్ర
- బిఆర్ఎస్ సమావేశంలో మాజీమంత్రి వేముల ఆరోపణలు

**నిజామాబాద్,జూన్3 :**
విద్యుత్ డిస్కమ్‌ను మూడు ముక్కలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న కొత్త విధానం వెనుక వేల కోట్ల కుంభకోణం దాగి ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఫ్యాక్టరీలు, కమర్షియల్, గృహ అవసరాల సంబంధించి ఆదాయం వచ్చే డిస్కమ్‌లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వేల కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పథకం వేసిందని ఆరోపించారు. ఆదాయం లేని, బిల్లులు రాని రైతు వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ, లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లను కలిపి 'రైతు డిస్కాం'గా మారుస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, సర్ అవగాహనా, బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ..

# తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

మొదటిపేజీ తరువాయి

జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# అత్యధిక కాలం ప్రధానిగా మోడీ నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్

మొదటిపేజీ తరువాయి

అలా మొత్తం 4,398 రోజులు ప్రధానిగా కొనసాగారు. ఇంతకాలం పదిలంగా ఉన్న ఈ రికార్డును మోదీ జూన్ 10న చెరిపేయబోతున్నారు. ఈ నెల 10తో మోదీ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుంటారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన ప్రధానిగా కొనసాగుతున్నారు. మోదీ ఇంతకుముందు కూడా ప్రధానిగా మరో రికార్డును బద్దలుకొట్టారు. వరుసగా, అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ రికార్డును జూలై 5, 2025న దాటేశారు. ఇందిరాగాంధీ జనవరి 24, 1966న ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి, వరుసగా 4,077 రోజులపాటు కొనసాగారు. ఆమె మార్చి 24, 1977లో వరకు ప్రధానిగా కొనసాగారు. అలా, ఇందిరా గాంధీ కంటే ఎక్కువ రోజులు వరుసగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోదీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951?52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది.

# నైజీరియా యువతకు శిక్షణ రాష్ట్ర విత్తన రంగం ఉపకరిస్తుందన్న తుమ్మల

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా నైజీరియాలోని టరాబా రాష్ట్రానికి చెందిన యువతకు వారు శిక్షణా సర్టిఫికెట్లను అందజేశారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఈ శిక్షణలో భాగంగా నైజీరియా యువతకు విత్తన ఉత్పత్తి, హైబ్రిడ్ సీడ్ టెక్నాలజీ వంటి కీలకమైన అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయం, విత్తన రంగాల్లో తెలంగాణ, రాబా రాష్ట్రాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేవలం శిక్షణకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో రైతులకు శిక్షణ ఇవ్వడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడం వంటి రంగాలలో కూడా పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగానే తెలంగాణ?టరాబా రాష్ట్రాల మధ్య 'స్టర్ స్టేట్'ఒప్పందంపై ప్రాథమిక చర్చలు జరిగాయని వివరించారు. ప్రస్తుతం తెలంగాణ విత్తన రంగం సాధించిన ప్రగతితో యావత్ భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇక్కడి అంతర్జాతీయ స్థాయి శిక్షణ ద్వారా నైజీరియా యువత ఎంతో విలువైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకున్నారని అభినందించారు.

# విద్యుత్ డిస్కమ్‌ను మూడు ముక్కలు

మొదటిపేజీ తరువాయి

గతంలో కమర్షియల్, ఇండస్ట్రియల్ విభాగాల నుండి వచ్చే ఆదాయంలో నుండి ఏటా రూ.10 వేల కోట్లు ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం వాడేవారమని, ఇప్పుడు లాభాలు వచ్చేవి ప్రైవేటుకు ఇచ్చి, కరెంట్ డిపార్ట్‌మెంట్‌పై ఉన్న రూ.35,000 కోట్ల బాకీని రైతు డిస్కాంపై నెడుతున్నారని మండిపడ్డారు. దీనివల్ల భవిష్యత్తులో రైతులకు ఉచిత కరెంట్ అందకుండా చేసి, వ్యవసాయ రంగాన్ని నిలువునా ముంచేసేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని, ఈ వేల కోట్ల కుంభకోణాన్ని ప్రజలందరికీ వివరించి కాంగ్రెస్ గుట్టు రట్టు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ నగరంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధిని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాశనం చేస్తున్నాయని, ప్రజల కోసం ఉద్దేశించిన ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పార్టీ తన సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. గతంలో బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్న సమయంలో నిజామాబాద్ జిల్లా ప్రజల అవసరాల కోసం మెయిన్ రోడ్డుపై, రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఇరిగేషన్ ఎస్ఈ ఆఫీస్ స్థలాన్ని కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం ఎంపిక చేసి ఆనాడు ఆర్టీసీ బోర్డు మీటింగ్‌లో రూ. 20 కోట్ల నిధులతో అత్యాధునిక బస్టాండ్ నిర్మించాలని ప్రతిపాదనలు కూడా ఆమోదించారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, కోట్ల రూపాయల విలువైన ఆ బస్టాండ్ స్థలాన్ని ప్రజల అవసరాలకు కాకుండా, వారి సొంత కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ కోసం, కమర్షియల్ కాంప్లెక్స్ (షాపింగ్ మాల్స్) నిర్మించి కిరాయిల ద్వారా డబ్బులు సంపాదించుకోవడానికి కేటాయించు కోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడే పవన్ కళ్యాణ్ ఇక్కడ సభల పెడుతా అనడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే బాధపడి 11 రోజులు అన్నం తినని పవన్ కళ్యాణ్ ఇవాళ మన గడ్డపైకొచ్చి పునర్నిర్మాణం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ వీజీ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, నియోజకవర్గ ఇంచార్జ్ రవీందర్ సింగ్, మాజీ మేయర్ నీతు కిరణ్, నూడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్ ఠాకూర్, నవీద్ ఇక్బల్, పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా

మొదటిపేజీ తరువాయి

2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు.

నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్షరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో

కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తాన్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.

# తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

మొదటిపేజీ తరువాయి

ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండిఎ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి.

అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷-లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాంఅని మంత్రి తెలిపారు.

# పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు.

ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# అత్యాధునిక వైద్య పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం బోర్పట్ల గ్రామంలో రూ.1200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 'థెరానిమ్ బయోలాజిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఫార్మా రాజధాని హైదరాబాద్‌ను బయో టెక్నాలజీ రంగంలోనూ గ్లోబల్ లీడర్ గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

రాబోయే రోజుల్లో బయోటెక్నాలజీ రంగంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ జెనెటిక్స్ వంటి సాంకేతికతలు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాయన్నారు. ఫలితంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేలా.. తలెత్తే సవాళ్లను అధిగమించేలా.. దిగ్గజ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నామన్నారు. లైఫ్ సైన్సెస్ పాలసీ, వన్ బయో హబ్, గ్రీన్ ఫార్మా సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్ తదితర విప్లవాత్మక అడుగులు లైఫ్ సైన్సెస్ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదపడతాయన్నారు.

ఓ వైపు లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే.. మరోవైపు వారికి కావాల్సిన 'రెడీ టూ వర్క్ ఫోర్స్'ను తయారు చేసే బృహత్తర బాధ్యతను తాము తీసుకున్నామన్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ ఫార్మా కంపెనీలకు పిలుపునిచ్చారు. తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చే ప్రయాణంలో 'థెరానిమ్ బయోలాజిక్స్' మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ మరొక కీలక మైలురాయి అని.. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు.

క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు సంబంధించిన ఔషధాలను ఇక్కడ ఉత్పత్తి చేసి... యూఎస్ సహా పలు దేశాలకు ఎగుమతి చేయనున్నట్టుగా వివరించారు. ఈ ప్లాంట్ ద్వారా... కొత్తగా సుమారు1500 మందికి పైగా ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహా, టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కంపెనీ ప్రతినిధులు కె. నిత్యానంద రెడ్డి, డా. మదన్ మోహన్ రెడ్డి, డా. శాతకర్ణి ఎమ్., డా. ఐ.ఎస్.ఆర్. రావు, సనత్ ఛట్టోపాధ్యాయ, దేవ్ మరాల్డో తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో తురింగియా ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

# ఎన్టీఆర్ రాకతోనే బడుగులకు రాజకీయ న్యాయం ఇవాళ ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటే ఊరుకుంటామా?

ఎన్టీఆర్ పార్టీ ప ఎట్టి రాజకీయాల్లోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందని టీడీపీ తెలంగాణ నేతలు అన్నారు. ఈ మేరకు పొలిట్‌బ్యూరో మెంబర్ అర్వింద్ కుమార్ గౌడ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ గురించి తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ సమాధి తొలగిస్తామని.. ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు కాదని.. అంబేద్కర్, పూలే విగ్రహాలు తీసేస్తారా అని ప్రశ్నించారు. కొత్తగా పుట్టిన పార్టీ వాళ్లు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం చంద్రబాబు నాయుడు ఆనాడు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ తెచ్చిన సంస్కరణల వల్లే తెలంగాణ ఇప్పుడు నంబర్ వన్‌గా ఉందని అర్వింద్ అన్నారు. కొత్తగా పెట్టిన పార్టీ వాళ్లు.. తాము ముఖ్యమంత్రి అవుతామని విగ్రహాలు తొలగిస్తామని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎక్కడైనా మీటింగ్‌లు పెట్టుకోవచ్చని.. పోటీ చేయవచ్చన్నారు. కానీ ఇక్కడ మీటింగ్‌లు పెట్టుకోవద్దని... పెడితే అడ్డుకుంటామని అనడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటిగా ఉందామని అర్వింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.తెలంగాణ తమ వల్లనే వచ్చిందన్న కేసీఆర్ పదేళ్లు పాలన చేశారని టీడీపీ నేత నన్నూరి నర్సారెడ్డి అన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూన్ 04, 2026

# వరి కోయకాలను తగలబెట్టొద్దు -- భూమిని, భవిష్యత్తును కాపాడండి: రైతులకు కాజీపేట డివిజన్ ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి కీలక విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిది హనుమకొండ జూన్ 3**

హనుమకొండ జిల్లా, కాజీపేట డివిజన్ ప్రతినిధి: రైతులు పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి కోయకాలు, వరిగడ్డి, మొక్కజొన్న కాండాలు తదితర పంట అవశేషాలను తగలబెట్టకుండా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని కాజీపేట డివిజన్ ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారవంతత దెబ్బతినడమే కాకుండా పర్యావరణానికి, వ్యవసాయ రంగానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పంట కోతల అనంతరం కొంతమంది రైతులు పొలాలను త్వరగా సిద్ధం చేసుకోవాలనే ఉద్దేశంతో వరి కోయకాలు, వరిగడ్డి, మొక్కజొన్న కాండాలను తగలబెడుతున్నారని, ఇది అత్యంత హానికరమైన చర్య అని పేర్కొన్నారు. ఒకసారి నిప్పు పెట్టిన తర్వాత భూమి పైభాగంలో ఉండే సేంద్రీయ పదార్థాలు మాత్రమే కాదు, నేలలో జీవించే లక్షలాది సూక్ష్మజీవులు కూడా నాశనమవుతాయని తెలిపారు.

భూమిలో ఉండే సూక్ష్మజీవులు నేల సారాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, అవే మొక్కలకు అవసరమైన పోషకాలను అందుబాటులోకి తీసుకువస్తాయని చెప్పారు. కోయకాలను కాల్చడం వల్ల ఈ జీవ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని భవిష్యత్తులో పంటల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించి అవశేషాలను కాల్చకుండా భూమిలో కలిపే విధానాలను అనుసరించాలని సూచించారు.

వరి కోయకాలను భూమిలో కలపడం ద్వారా సేంద్రీయ కార్బన్ శాతం పెరుగుతుందని, నేల తేమ ఎక్కువ కాలం నిల్వ ఉంటుందని, తద్వారా ఎరువుల వినియోగం కూడా కొంత మేర తగ్గుతుందని వివరించారు. సూపర్ సల్ఫర్ వంటి సూక్ష్మపోషకాలను వ్యవసాయ శాఖ సూచనల మేరకు వినియోగించడం ద్వారా భూమి ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు.

పంట అవశేషాలను దహనం చేయడం వల్ల గాలిలోకి కార్బన్ డైఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై వాతావరణ కాలుష్యం పెరుగుతుందని అన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే పొలాల్లో పెట్టిన మంటలు కొన్ని సందర్భాల్లో అదుపు తప్పి సమీపంలోని ఇతర పంటలకు, చెట్లకు, విద్యుత్ స్తంభాలకు, గడ్డి నిల్వలకు వ్యాపించి భారీ అగ్ని ప్రమాదాలకు దారితీస్తున్నాయని గుర్తు చేశారు.

ప్రతి సంవత్సరం పంట అవశేషాల దహనం కారణంగా అనేక ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, రైతులు ఒక చిన్న నిర్లక్ష్యంతో లక్షల రూపాయల నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందని అన్నారు. అందువల్ల రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పంట అవశేషాలను తగలబెట్టే అలవాటును పూర్తిగా మానుకోవాలని కోరారు.

వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారని, పంట అవశేషాలను ఎలాంటి యంత్రాల సహాయంతో భూమిలో కలపాలి, ఏ ఎరువులు వాడాలి, ఎలాంటి సూక్ష్మపోషకాలు అవసరం అనే విషయాలపై సలహాలు ఇస్తున్నారని చెప్పారు. రైతులు అధికారులను సంప్రదించి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.

భూమి రైతుకు తల్లిలాంటిదని, ఆ భూమి సారాన్ని కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత అని ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. నేడు పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టం వెంటనే కనిపించకపోయినా, భవిష్యత్తులో దిగుబడులు తగ్గడం, ఎరువుల ఖర్చులు పెరగడం, నేల నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురవుతాయని వివరించారు.

రైతులు వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల అవశేషాలను నిప్పంటించకుండా వాటిని సేంద్రీయ ఎరువులుగా వినియోగించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని, అందుకు పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నిలిపివేయాలని కోరారు.

“వరి కోయకాలను తగలబెట్టడం వల్ల రైతుకే నష్టం. భూమిలోని సూక్ష్మజీవులు నశిస్తాయి, నేల సారం తగ్గుతుంది, దిగుబడులు పడిపోతాయి. రైతులందరూ వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ పంట అవశేషాలను భూమిలో కలిపి సారవంతమైన వ్యవసాయానికి సహకరించాలి. భూమిని కాపాడితేనే భవిష్యత్తు తరాలకు మంచి వ్యవసాయాన్ని అందించగలం” అని కాజీపేట డివిజన్ ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# కరీంనగర్ జిల్లా సైకిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సైక్లింగ్ ర్యాలీ

**కరపత్రం ప్రతినిది కరీంనగర్జూన్ 3**

సైక్లింగ్ ఆరోగ్యంపై చక్కటి ప్రభావం చూపుతుందని, సైక్లింగ్ చేయడం ద్వారా అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటామని , రోజు వారి కార్యకలాపాలను చాలా ఉషారుగా చేయగలుగుతామని కరీంనగర్ జిల్లా అటవి అధికారి ఎస్.సత్యనారాయణ , విజయ్ కుమార్ ఏసీపీ రూరల్, కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి , అధ్యక్షులు డాక్టర్ కెప్టెన్ బి.మధుసూదన్ రెడ్డి , ఇతర ప్రతినిధులతో కలిసి కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ నుండి ఎలగందుల ఖిల్లా వరకు ఏర్పాటు చేసినటువంటి సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతూ అగ్రదేశాలైన ఫ్రెన్స్, జర్మనిలో సైక్లింగ్ కు చాలా క్రేజ్ ఉందని ప్రాధాన్యత ఇస్తున్నారని తద్వారా వారు వనరులను భావి తరాలకు సంరక్షించడమే కాకుండా పర్యావరణాన్ని సైతం కాపాడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు.

ప్రతి ఒక్కరూ సైక్లింగ్ చేయడాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలని , దేశ ఆర్థికాభివృద్ధికి చేయుతనివ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని సైక్లింగ్ అలవాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని చెప్పారు.





విజయ్ కుమార్, రూరల్ ఏసీపి మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వలన గుండె సంబంధిత వ్యాధుల నుండి ఉపశమనం కలుగుతుందని ,ఇంధనం కాపాడు కాపాడుకోగలుగుతామని తద్వారా దేశ జాతీయ ఆదాయం పై ప్రభావం చూపుతుందని చెప్పారు.

అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వలన గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని, బరువు సులభంగా తగ్గుతుందని, ఒత్తిడి తగ్గించి మానసిక ప్రశాంతత సైతం లభిస్తుందని తెలుపుతూ సైక్లింగ్ అనేది ఒక అద్భుతమైన ఏరోబిక్ వ్యాయామం అని గంటల్లో కేలరీలను కరిగిస్తుందని చెప్పారు.

కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కెప్టెన్ బి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఎన్నో చైతన్యవంతమైన కార్యక్రమాలను నిర్వహించడం జరిగినదని మరియు పోటీలను నిర్వహించి సైక్లింగ్ పట్ల క్రేజ్ పెంపొందించగలగాని చెప్పారు.

ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చాలా చక్కటి స్పందన లభించింది అని పాల్గొన్న క్రీడాకారులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

చాలా ఉత్సాహంగా కొనసాగిన ఈ ర్యాలీలో నినాదాలు చేసి చైతన్య కల్పించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వి. జగదీశ్వర చారి , ఎం. అరవింద్ బాబు , మధు, తిరుపతి , ఏం.మహేందర్ , అఖిల్ , ఏజే పెడల్స్ ప్రతినిధి, తల్లిదండ్రులు , క్రీడాకారులు పాల్గొన్నారు.

# గోపి చెరువులో పక్షుల సందడి..

- జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన
- వలస పక్షుల ఆవాసం గోపి చెరువు.. బర్డ్‌వాక్‌తో చైతన్యం
- పక్షులను కాపాడితేనే ప్రకృతి పరిరక్షణ
- బర్డ్‌వాక్‌తో గ్రామస్తులకు జీవవైవిధ్యంపై అవగాహన
- అటవీశాఖ-ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సంయుక్త కార్యక్రమం

**కరపత్రం ప్రతినిది జనగామ:**

చిన్నమాడూరు గ్రామంలోని గోపి చెరువు బుధవారం పక్షుల కిలకిలారావాలతో సందడిగా మారింది. జనగామ అటవీశాఖ, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బర్డ్‌వాక్ కార్యక్రమం గ్రామస్తులను ఆకట్టుకుంది. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పక్షుల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, చిత్తడి నేలల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వర్‌రావు చెరువులోని వివిధ రకాల నీటి పక్షులను గుర్తించి వాటి ప్రత్యేకతలను వివరించారు. చెరువులు, చిత్తడి నేలలు వేలాది వలస, స్థానిక పక్షులకు ఆశ్రయంగా నిలుస్తాయని, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వన్యప్రాణి ఫొటోగ్రఫీ ద్వారా పక్షుల జీవన



విధానం, ఆహారపు అలవాట్లు, ప్రకృతికి అవి అందించే సేవలను గ్రామస్తులకు వివరించారు. సొసైటీ కార్యదర్శి శ్యాంసుందర్ మాట్లాడుతూ గోపి చెరువు ప్రతి ఏడాది వలస పక్షులకు ఆవాసంగా మారుతుందని, జీవవైవిధ్య పరిరక్షణతోనే ప్రకృతి సంపదను భావితరాలకు అందించగలమని పేర్కొన్నారు. పక్షులు వ్యవసాయానికి మిత్రులని, హానికర పురుగులను నియంత్రించడం ద్వారా రైతులకు మేలు చేస్తాయని చెప్పారు. ప్రముఖ పర్యావరణవేత్త, సొసైటీ జాయింట్ సెక్రటరీ పిట్టల రవిబాబు రైతులకు సహజ వ్యవసాయం, భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, నీటి సంరక్షణ, సమగ్ర వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలకు దూరంగా ఉండి నాణ్యమైన విత్తనాలను ఉపయోగించాలని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. జనగామ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎన్. భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 12 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు





తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ జోగేశ్వర్ మాట్లాడుతూ గ్రామంలో పక్షుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని, ఇలాంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం గోపి చెరువు పరిసర ప్రాంతంలో మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు జావేద్ హుస్సేన్, రమేష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు రవీందర్, శోభ, జరీనా, బీట్ ఆఫీసర్లు రమేష్ నాయక్, అంజయ్య, ధర్మరాజు, కాకా రవి, పంచాయతీ కార్యదర్శి శివారెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, రైతులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్ర భావన నిర్మాణం పూజలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్ దాస్ మల్లేష్ గౌడ్

**కరపత్రం ప్రతినిది వెల్దుర్తి మాసాయిపేట జూన్ 3**







మెదక్ జిల్లా మాదూర్ గ్రామంలో బుధవారం నాడు సర్పంచ్ దివ్య భారతి లింగం గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా అంగన్వాడీ కేంద్ర భవనం నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ జిల్లా నాయకులు బాలాగౌడ్ సురేష్ అల్లం మధు గ్రామ వార్డు సభ్యులు వెల్దుర్తి గ్రామ సర్పంచ్ ఆదర్శ్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి గ్రామ కార్యదర్శి గ్రస్తులు తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్ కు ఉత్తరాఖండ్ సీఎం అభినందనలు.

**కరపత్రం ప్రతినిది కరీంనగర్ జూన్ 3**



సీఎం పుష్కర్ సింగ్ ధామి ని సన్మానించిన మేయర్ కోలగాని ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రోజున జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ను ఈ సందర్భంగా అభినందించి , శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ప్రప్రదంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇటీవల బిజెపి ఘన విజయం సాధించిన నేపథ్యంలో, మేయర్ గా అతి పిన్న వయసు కలిగిన కోలగని శ్రీనివాస్ నియామకం కావడం పట్ల సీఎం పుష్కర్ సింగ్ ధామి సంతోషం వ్యక్తం చేశారు. మేయర్ కోలగాని శ్రీనివాస్ ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామికి కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. అలాగే సమావేశాలకు అతిథులుగా హాజరైన ఉత్తరాఖండ్ రాష్ట్ర మంత్రులు సుబోధ్ ఉన్నియాల్, ప్రేమ్ చంద్ర అగర్వాల్ , మదన్ కౌశిక్ ,లోకసభ సభ్యులు (హరిద్వార్) త్రివేంద్ర సింగ్ రావత్ రాజ్యసభ సభ్యులు మహేంద్ర భట్, డా. ప్రేమ్ చంద్ర అగర్వాల్ (ఎమ్మెల్యే, ఋషికేశ్ నియోజకవర్గం)లను మేయర్ కోలగని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇంటిపై చర్యలు తీసుకోవాలి



**కరపత్రం ప్రతినిది మంథని జూన్ 3**

మంథని జూన్ 3:. మంథని మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు కు సంబంధించి గాంధీ చౌక్ లో ఇంటి నెంబర్ 5-98 వడ్లకొండ జ్యోతి నిబంధనకు విరుద్ధంగా సెట్ బ్యాక్ లేకుండా నిర్మించిన ఇంటిపై చర్యలు తీసుకోవాలని తాటిపాముల నరేష్ జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నెట్ బ్యాంకింగ్ లేకుండా ఇంటిని నిర్మించడంతోపాటుగా మూడు ఫ్లోర్లుగా ఇంటి నిర్మించిన పాటు మూడు ఫీట్లు రోడ్డు మీదికి వచ్చి బాల్కనీ నిర్మించారని పేర్కొన్నారు. వడ్లకొండ జ్యోతి భర్త వీకే రవి కౌన్సిలర్ గా ఉన్న సమయంలో తన పలుకుబడిని ఉపయోగించి అక్రమంగా నిర్మాణం చేశాడని దీనిపైన పూర్తి ఆధారాలతో జిల్లా కలెక్టర్కు,మంథని మున్సిపల్ కమిషనర్కు , మున్సిపల్ చైర్మన్ కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం కింద ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# 49 వ డివిజన్ లో చీరల పంపిణి చేసిన కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్



**కరపత్రం ప్రతినిది కరీంనగర్ జూన్ 3**

కరీంనగర్ నగరపాలక సంస్థ49 డివిజన్ కార్పోరేటర్ అన్నం లక్ష్మీ ప్రకాష్ చేతుల మీదుగా బుధవారం రోజున మన సనాతన ధర్మం సేవా సమితి డివిజన్ కార్యాలయం వద్ద మహిళలకు చీరల పంపిణి కార్యక్రమం జరిగింది. 49వ డివిజన్లో ఓటు హక్కు , ఆధార్ కార్డు రేషన్ కార్డు ఉండి దారిద్ర రేఖకు దిగువన ఉన్న అర్హులైన పేదవారికి ప్రతి ఒక్కరికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ తో , ఆర్ పి గాయత్రి, వార్డ్ ఆఫీసర్ మెండే శిరీష, డివిజన్ ప్రజలు విజయలక్ష్మి శారద ,మమత, కవిత, సులోచన సౌజన్య ,స్వరూప ,లావణ్య తో పాటు బిజెపి కార్యకర్తలు లంబు సుధాకర్ రెడ్డి గాదగోని రమేష్ భూమ్ రావు, నల్మచు సంతోష్ ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
గురువారం జూన్ 04, 2026

# మహిళల ఆర్థిక సాధికారతే సమాజ అభివృద్ధికి బలమైన పునాది







- మహిళల ఆర్థిక సాధికారతకు మరో ముందడుగు
- జిల్లా మహిళా సమాఖ్య 'పెట్రోల్ బంక్" నిర్మాణానికి శంకుస్థాపన

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 3**

మహిళల ఆర్థిక సాధికారతే సమాజ అభివృద్ధికి బలమైన పునాది అని, మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. బుధవారం మహిళల ఆర్థిక స్వావలంబనకు మరింత బలం చేకూర్చే దిశగా హనుమకొండ జిల్లా మడికొండలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పెట్రోల్ బంక్‌కు బుధవారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. డీఆర్‌డీఏ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా యజమానులుగా తీర్చిదిద్ది, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు ఏ రంగంలోనైనా విజయాలు సాధించగలరని పేర్కొన్న ఆమె, ఇంటిని సమర్థవంతంగా నిర్వహించే మహిళ వ్యాపారం, పరిశ్రమ, వ్యవసాయం, సేవా రంగాల్లోనూ తన ప్రతిభను నిరూపించగలదని అన్నారు. మడికొండలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కావడం సంతోషకరమని, భవిష్యత్తులో "మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్"గా ఇది ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ కార్యక్రమాలు, సౌరశక్తి రంగం వంటి అనేక రంగాల్లో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేశారు. మహిళలను నాయకత్వ స్థానాల్లో నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి ఆదాయ వనరులను పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న ఈ పెట్రోల్ బంక్ మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని అందించడంతో పాటు మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మహిళలు కుటుంబానికి, సమాజానికి వెన్నెముకలాంటివారని, వారి ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. మహిళల సాధికారత కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధి సుధీర్, ప్రజాప్రతినిధులు, ఐకేపీ ప్రాంతీయ సమన్వయకర్తలు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేటలో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు



**కరపత్రం ప్రతినిధి కాజీపేట, జూన్ 3**

భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను కాజీపేటలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాజీపేట చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను పార్టీ నాయకులు కట్ చేసి, హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్, 47వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సంకు నర్సింగరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు ప్రతి దశలో హరీష్ రావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

పార్టీకి అండగా నిలిచే క్రమశిక్షణ గల నాయకుడిగా, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ప్రజానాయకుడిగా హరీష్ రావు గుర్తింపు పొందారని తెలిపారు. హరీష్ రావు నాయకత్వం యువతకు, పార్టీ కార్యకర్తలకు ఆదర్శప్రాయమని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్, శిరుమల్ల దశరథం, ఎం.డి. ఆఫ్జల్, పాలడుగుల రామస్వామి, ఎం.డి. మహ్మద్, దువ్వ నరేష్, గబ్బెట కరుణ్ (సిద్దు), మర్యాల కృష్ణ, ఎం.డి. మతీన్, తండమళ్ల వేణు, అన్నంపెల్లి రాజ్‌కుమార్, మంద రాజ్‌కుమార్, కొంతం మల్లేష్, పడిదెల శేఖర్, బండి రాంచందర్, మాచర్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీలో ఆల్ ఇండియా 1400వ ర్యాంక్ సాధించిన మాతంగి జాన్‌కు ఘన సన్మానం

- భవాని నగర్ యువ ప్రతిభకు ప్రశంసల వెల్లువ
- విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన జాన్ : సందెల విజయ్ కుమార్



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 3**

కాజీపేట మండలం డీజిల్ కాలనీ భవాని నగర్‌కు చెందిన విద్యార్థి మాతంగి జాన్ భారతీయ సాంకేతిక విద్యాసంస్థల (ఐఐటీ) ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియా 1400వ ర్యాంక్ సాధించి విశేష ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా భవాని నగర్‌లోని అక్షర స్కూల్‌లో బుధవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాతంగి విలియమ్స్, శిభారాణి దంపతుల పెద్ద కుమారుడైన జాన్, అక్షర స్కూల్‌లో పదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేసి, అనంతరం ఆల్ఫోర్స్ అకాడమీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడం పాఠశాలకే కాకుండా భవాని నగర్‌కు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా 47వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్ట్ కార్పొరేటర్ సందెల విజయ్ కుమార్ విద్యార్థిని శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృషి, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధించవచ్చని మాతంగి జాన్ నిరూపించాడన్నారు. భవిష్యత్తు లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, గురువులకు, కాలనీకి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాన్ సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. అక్షర స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్ రెడ్డి, అనిత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసర్ల నాగేష్, సత్యవరం మధుకర్, సురేందర్, జార్జి, శంకర్, రాజేష్ తదితరులు విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కాలనీ పెద్దలు భూపాల్ రెడ్డి, దేవదాస్, సదానందం, మాచర్ల శేఖర్, మేక రాజు, శ్రీనివాస్, రవి, రమేష్ తదితరులు జాన్‌కు శుభాకాంక్షలు తెలియజేసి అతని విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గర్భిణుల ప్రసవాలు, టీకాల వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 3**

ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు కూడా గర్భిణుల నమోదు, ప్రసవ వివరాలు, శిశువులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల వివరాలను సంబంధిత ఆన్‌లైన్ వేదికల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ. అప్పయ్య ఆదేశించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రసవ సేవలు అందిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల సమాచార నమోదు సిబ్బందికి 'యువిన్' మరియు ఆరోగ్య నిర్వహణ సమాచార వ్యవస్థ ఆన్‌లైన్ వేదికలలో వివరాల నమోదు విధానంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. గర్భిణుల వివరాలను నమోదు చేయడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, జన్మించిన శిశువులకు అందించిన టీకాల ఆధారంగా తదుపరి టీకాలను సకాలంలో అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఆరోగ్య శాఖ చేపట్టే వివిధ కార్యక్రమాల ప్రణాళిక, అమలు, సమీక్షలో ఈ సమాచార వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి రోజు జరిగిన సేవలకు సంబంధించిన వివరాలను అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, గర్భిణుల పరీక్షల నివేదికలు, ఇతర ఆరోగ్య సంబంధిత సమాచారాన్ని కూడా సంబంధిత ఆన్‌లైన్ వేదికలలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో యువిన్ సమన్వయకర్త జ్యోత్స్న, వ్యాక్సిన్ శీతల శృంఖల నిర్వహణ అధికారి శిరీష, జిల్లా సమాచార నిర్వహణ అధికారి ప్రవీణ్ ఆన్‌లైన్ వేదికల నిర్వహణ, సమాచార నమోదు విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, మాతా-శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రుబీనా అఫ్రోజ్, గణాంక అధికారి జి. ప్రసన్నకుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ కార్యక్రమ నిర్వహణ అధికారి స్వప్న తదితరులు పాల్గొని వివిధ అంశాలపై వివరించారు.

# భూ తగాదాల్లో సెటిల్‌మెంట్లు చేసే వారికి "కౌన్సిలింగ్" ఇవ్వండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్






**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 3**

భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వ వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు "కౌన్సిలింగ్" నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కెయుసి పోలీస్ స్టేషన్ సందర్శించారు. బుధవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహరావు, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీగదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా వున్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్ళు ఎలావున్నారు. ఏం చేస్తున్నారు మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. తగాదాల్లో తలదూర్చే రౌడీ షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక "కౌన్సిలింగ" ఇవ్వాలని, రౌడీ షీటర్లపట్ల సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా వున్న రౌడీపై నజర్ పెట్టాలని, ముఖ్యంగా స్థానికంగా వున్న సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్.ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడంతో పాటు, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో ఎస్.ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమర్, రాజమౌళి పాల్గోన్నారు.

# టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 3**

జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సమర్థవంతంగా అమలవుతున్న తీరును పరిశీలించేందుకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ. అప్పయ్య బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపుర అంగన్‌వాడీ కేంద్రం-4తో పాటు పెద్దమ్మగడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్యూ లిస్టు ప్రకారం అర్హులైన చిన్నారులు, గర్భిణుల తల్లిదండ్రులకు ముందస్తుగా సమాచారం అందించి టీకాల కేంద్రాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీకాల నాణ్యత దెబ్బతినకుండా వ్యాక్సిన్ నిల్వ, రవాణాలో శీతల శృంఖల వ్యవస్థను కచ్చితంగా పాటించాలని సూచించారు. టీకా అనంతరం తల్లిదండ్రులకు తెలియజేయాల్సిన ముఖ్యమైన నాలుగు అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. టీకాలు అందిస్తున్న విధానం, లబ్ధిదారుల నమోదు, వ్యాక్సిన్ వినియోగ విధానాన్ని కూడా ఆయన పరిశీలించారు. తమ పరిధిలోని అర్హులైన బాలికలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరిగా అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బ నివారణకు ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలలో వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎంలు, ఫార్మసిస్టులు, నర్సింగ్ అధికారులు, సబ్ యూనిట్ అధికారి పి. విప్లవ్ కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ వెన్నంటి నడిచిన నిబద్ధత కలిగిన నాయకుడు హరీష్ రావు

- బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు
- మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 3**

భారత రాష్ట్ర సమితి పార్టీకి వెన్నెముకగా నిలుస్తూ, పార్టీ అధినేత కేసీఆర్ అడుగుజాడల్లో నిబద్ధతతో నడుస్తున్న నాయకుడు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ ఉపపక్ష నేత తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బుధవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు ప్రతి దశలో కేసీఆర్‌కు అండగా నిలిచిన నిజమైన గులాబీ సైనికుడు హరీష్ రావు అని పేర్కొన్నారు. పార్టీ కోసం, కార్యకర్తల కోసం నిరంతరం శ్రమించే నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. సంక్లిష్ట పరిస్థితుల్లో పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించే ట్రబుల్ షూటర్‌గా హరీష్ రావు పేరు సంపాదించుకున్నారని, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ ఆయన ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, తెలంగాణ ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ బీఆర్ఎస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గురుకుల టెండర్లలో అర్హత నిబంధనలకు మినహాయింపు ఇవ్వాలి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 3**

గురుకుల విద్యాసంస్థల్లో నిర్వహించే కిరాణా, గుడ్లు సరఫరా టెండర్లను గతంలో అమలు చేసిన జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ) విధానంలోనే కేటాయించాలని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ గురుకులాల్లో కిరాణా, గుడ్ల సరఫరాతో పాటు క్యాటరింగ్, కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, పరిశుభ్రత నిర్వహణకు సంబంధించిన టెండర్లను గతంలో జిల్లా కొనుగోలు కమిటీ ఆధ్వర్యంలో కేటాయించేవారని తెలిపారు. అయితే ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల వల్ల సామాన్య వర్గాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్లకు అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్తగా టెండర్లలో పాల్గొనదలచిన వారికి అవకాశం కల్పించాలంటే ఆదాయపు పన్ను రిటర్నులు, వ్యాపార అనుమతి పత్రం, ఆహార భద్రత ప్రమాణాల ధ్రువీకరణ, గత అనుభవ ధ్రువీకరణ, ప్రాధాన్యత అర్హత పత్రాలు వంటి నిబంధనలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. తద్వారా వెనుకబడిన వర్గాలకు చెందిన కాంట్రాక్టర్లు కూడా సమాన అవకాశాలు పొందగలరని పేర్కొన్నారు.

అలాగే గురుకులాల కిరాణా, గుడ్ల టెండర్లను గతంలో అమలు చేసిన విధంగానే జిల్లా కొనుగోలు కమిటీ స్థాయిలో కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ చైర్మన్ మంద శ్యామ్, రాష్ట్ర సహ కన్వీనర్ శనిగరం శ్రీనివాస్, రాష్ట్ర న్యాయ విభాగం సహ కన్వీనర్ మారపల్లి మనోజ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొల్లె మధుకర్, ఒంటేరు చక్రి, రమాకాంత్, బాలరాజు, హరీష్, దూడల సిద్ధు, చింట తదితరులు పాల్గొన్నారు.